దివ్యాంగులకు చేయూతనిస్తాం

పాలకుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాలను అందచేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్ తెలిపారు. బుధవారం మండలంలోని ముత్తారం రైతు వేదికలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తుల స్వీకరణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫ్లోరెన్స్ హాజరై మాట్లాడారు. ఈ మూడు మండలాల నుంచి దివ్యాంగులు, వృద్ధులు 100 మంది వరకు హాజరై దరఖాస్తులు చేశారని తెలిపారు.



గద్దెల విస్తరణ లేనట్టేనా?

7

- 32 గుంటల స్థలంలోనే మేడారం గద్దెల సాలారం
- తల్లులను దర్శించుకునేందుకు ప్రతీ జాతరలో భక్తులకు ఇబ్బందులు
- 4 ఎకరాల్లో విస్తరించాలన్న ప్రతిపాదన అటకెక్కిన వైనం
- 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ జాప్యం
- ప్రపంచం అబ్బుర పడేలా జాతర నిర్వహిస్తామని దాటవేసిన గత ప్రభుత్వం
- ప్రశాంత దర్శనం కోసం కాంగ్రెస్ సర్కారైనా దృష్టి పెట్టాలని భక్తుల విజ్ఞప్తి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందింది. ప్రతీ రెండేళ్లకోసారి ఫిబ్రవరిలో జరిగే ఈ వనదేవతల మహా సంరంభానికి కోటిన్నరకు పైగా భక్తులు తరలొస్తారు. అంతేకాదు కొన్నేళ్లుగా మామూలు రోజుల్లోనూ దర్శనానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా మహాజాతర జరిగే ఆ నాలుగు రోజుల్లో సుదూర ప్రాంతాల నుంచి తరలొచ్చే కోట్లాది భక్తులు తల్లులను తనివితీరా దర్శించుకోలేని పరిస్థితి ఉంది. అందుకు కేవలం 32 గుంటల స్థలంలో నిర్మించిన సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణం (సాలారం) ఇరుకుగా ఉండడమే కారణం. ఈ క్రమంలో ఈ ప్రాంగాణానికి పక్కనే ఉన్న దేవాదాయ శాఖకు చెందిన నాలుగెకరాల్లో విస్తరించాలనే ప్రతిపాదన 2012 నుంచే ఉన్నా.. అది కార్యరూపం దాల్చలేదు. ఇక పక్కనే ఉన్న 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా ఓ కారణమేనన్న అభిప్రాయాలున్నాయి. కనీసం వచ్చే ఏడాది జరగబోయే మహాజాతర నాటికైనా ఇది కార్యరూపం దాల్చాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రంగప్ప ఇదేం బాధప్ప?


పట్టణంలోని రంగప్ప చెరువు

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అది నూరేళ్ల చరిత్ర కలిగిన రంగప్ప చెరువు. చారిత్రక కట్టడమైన ఈ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని నాయకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలాయి. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఓట్ల కోసం నేతలు రంగప్ప చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామనే అంశాన్ని తెరపైకి తెస్తూ.. ఆ తరువాత విస్మరిస్తున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. రంగప్ప చెరువు అభివృద్ధి హామీలకే పరిమితమైందని వారు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా రంగప్ప చెరువును అభివృద్ధి చేయడంపై పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రంగప్ప చెరువు జనగామ పట్టణానికి ఆనుకునే ఉన్నప్పటికీ ఆ విషయమై స్థానిక నాయకులు, మునిసిపాలిటీ అధికారులు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. వినాయక నిమజ్జనం, సద్దుల బతుకమ్మ పర్వదినం సందర్భంగా మహిళలు బతుకమ్మలు ఆడి నిమజ్జనం కూడా రంగప్ప చెరువులోనే చేస్తారు. స్థానికులతో పాటు గిర్నిగడ్డ, నెహ్రూ పార్కు ఏరియా, కోర్టు ప్రాంతం, వికాస్‌నగర్, గీతానగర్, బాణాపురంతో పాటు శామీర్‌పేట ప్రాంతవాసులు సైతం నిత్యం చెరువు కట్టపై ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ప్రస్తుతం రంగప్ప చెరువు కట్ట అసాంఘి క కార్యక్రమాలకు, మందుబాబులకు అడ్డాగా మారడంతో వాకింగ్ నిలిచి పోయింది. తాగిన మైకంలో కొందరు ఆకతాయిలు మద్యం సీసాలను పగులగొట్టి కట్టపై వేస్తుండడంతో కాలికి సీసా పెంకులు గుచ్చుకోవడంతో పాటు కట్ట చుట్టూ దట్టమైన ముళ్లచెట్లు ఏపుగా పెరగడంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఎవరూ వాకింగ్ చేయడానికి ముందుకు రావడం లేదు. చెరువును పట్టించుకోక పోవండతో కొందరు కబ్జాదారులు చెరువు శిఖం భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులు నోటీసులు ఇవ్వడమే కాకుండా కూల్చివేస్తామని ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి.


రంగప్ప చెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

పూడికతీస్తే తాగు, సాగునీటికి అనుకూలం..

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పట్టణంలోని రంగప్ప చెరువు మత్తడి నీరు బాణాపురం, శ్రీనగర్ కాలనీ, కురుమవాడ, జ్యోతినగర్ కాలనీ, బాలాజీనగర్ మీదుగా పయనిస్తాయి. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవుతూ కొన్ని సందర్భాల్లో జనగామ - హైదరాబాద్ రోడ్డు పైనుంచి పయనించి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే రంగప్ప చెరువును అధికారులు పట్టించుకొని పూడిక తీత పనులు చేపడితే జనగామ పట్టణానికి తాగునీటితో పాటు పరిసర ప్రాంతాలలో భూగర్భ జలాలు పెరిగి సాగునీటికి కూడా ఉపయోగపడే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఆ దిశగా నాయకులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- మాటల్లోనే పర్యాటక కేంద్రం హామీ
- నెరవేరని నేతల ఎన్నికల నాటి మాటలు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

హామీలకే పరిమితమైన అభివృద్ధి

గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రంగప్ప చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని, విగ్రహాలు ఏర్పాటు చేస్తామని అభివృద్ధి పనులు సైతం చేపట్టారు. కట్టపై మట్టిపోసిన కొన్నాళ్లకు ఏ కారణం చేతనో ఆ పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సైతం అభివృద్ధి పరుస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినా ఇంతవరకు నెరవేరలేదు. కొన్నేళ్లుగా చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని నాయకులు హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఆ దిశగా అడుగులు ఏనాడూ ముందుకు పడటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కట్టపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించి కట్ట చుట్టూ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి, రంగప్ప చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి..



- అనంతోజు దేవరాజు, గీతానగర్

జనగామ పట్టణ నడిబొడ్డున ఉన్న రంగప్ప చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులు పట్టించుకుని కట్టపై ఉన్న ముళ్లపొదలు తొలగించి రోడ్డు వెడల్పు చేయాలి. కట్టపై సుందరీకరణ పనులు చేపట్టాలి. గతంలో రంగప్ప చెరువు అభివృద్ధిపై నాయకులు ఇచ్చిన హామీలను అమలు పరిచేందుకు కృషి చేయాలి.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మినీజాతరకు అంకురార్పణ

- మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ
- తల్లుల దర్శనానికి 40వేల మందికి పైగా భక్తుల రాక
- సందడిగా మారిన సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం

వివరాలు 7లో...


మేడారంలో గుడిశుద్ధి పండుగలో పూజారులు

అత్యాధునిక పద్ధతులతో దిగుబడులు సాధించాలి

- రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటించాలి
- కిసాన్ మేళాలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేసి రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలంలోని నిడిగొండ గ్రామంలో కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ నాగాపూర్‌తో పాటు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కిసాన్ మేళా, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేయాలన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని, ఎప్పుడు ఒకే పంట కాకుండా కొత్త పంటలను సాగు చేయాలని, వరిలో సన్న రకం సాగు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలను రైతులు తప్పకుండా పాటించాలన్నారు. కోతులు, అడవి పందులు, పక్షుల బెడద నుంచి పంటలను సాంకేతిక పరిజ్ఞానంతో రక్షించుకోవాలని తెలిపారు. అంతకుముందు కిసాన్ మేళాతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖ, వివిధ కంపెనీల విత్తనాలు, ఎరువులు, సాంకేతిక ఉత్పత్తుల స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, వ్యవసాయ విశ్వవిద్యాలయం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఉమారెడ్డి, యాదాద్రి భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు బి.అనిల్‌కుమార్, వీరన్న, సతీష్‌చంద్ర, సంధ్యకిశోర్, ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్, వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మోహిస్సా ముజ్జబ, ఏడీఏలు వసంత సుగుణ, పరశురాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నిడిగొండలో కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

30 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం

- ఎస్సీలందరం అన్నదమ్ములమే..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని, మాదిగ, మాదిగ ఉపకులాల కల సాకారమైందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఎస్సీ కులాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం రేంవత్‌రెడ్డి ప్రకటించడం పట్ల బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని అంబేద్కర్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి, సీఎం చిత్రపటానికి ఎంపీ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు, రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు అందించాలని 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా ఉద్యమం జరిగిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినా న్యాయపరమైన సమస్యల వల్ల వర్గీకరణ జరుగలేదన్నారు. 2024 ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం రాజ్యాంగానికి లోబడి వర్గీకరణ చేపట్టవచ్చని చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పు వెలువడిన వెంటనే సీఎం స్పందించి కేబినెట్ సబ్ కమిటీని, ఏకసభ్య కమిషన్‌ను వేశారన్నారు. ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను సబ్ కమిటీ ఆమోదించి అసెంబ్లీలో ప్రవేశ పెట్టడం అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపడం గర్వంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదని, అందరం కూడా అన్నదమ్ములమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణతో పాటు, జనాభా దామాషా ప్రకారం ఎస్సీల రిజర్వేషన్‌ను 15 నుంచి 18 శాతంకు పెంచుతూ కార్యాచరణను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ పైన దేశంలో ఏ ప్రభుత్వం ముందుకురాని సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వచ్చి ప్రణాళిక రూపొందించడం సంతోషకరమని అన్నారు. 30 ఏళ్ల పాటు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా ఉద్యమానికి నాయకత్వం వహించిన మంద కృష్ణ మాదిగకు అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన అంబేద్కర్, ఉద్యమనాయకుడు మంద కృష్ణ, వర్గీకరణకు కార్యాచరణను ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డిలు ముగ్గురు మాదిగలు, మాదిగ ఉపకులాలకు చెందిన వారికి ఆదర్శ నాయకుల అని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, జిల్లా నాయకులు సీహెచ్.నరేందర్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, నాగరబోయిన శ్రీరాములు, బానోతు రాజేష్‌నాయక్, బూర్ల శంకర్, జేసీ రెడ్డి, మంచాల ఎల్లయ్య, గడ్డమీది వెంకటస్వామి, పార్టీ మండలాధ్యక్షులు శిరీష్‌రెడ్డి, గడ్డమీది సురేష్, జి.ప్రసాద్, ఐలయ్య, నాయకులు జీడి రమేష్, సారంగపాణి, మారపాక వసంత్, టి.సంపత్, రాజ్‌కుమార్, ఐలపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



మృతి చెందిన తాళ్లపల్లి ఉదయ్, ఉదయ్ (ఫైల్)

దేవరుప్పుల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగరాజుపల్లి-నీర్మాల గ్రామాల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామలోని కలెక్టరేట్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ తాళ్లపల్లి ఉదయ్(28) మృతి చెందాడు. ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఉదయ్ నీర్మాల శివారులో ఉన్న బోరు బావి వద్దకు ఉదయం స్నానం చేసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నీర్మాల గ్రామానికి చెందిన కారు ఎదురుగా వస్తూ ఢీకొట్టడంతో ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉదయ్ మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా గాయపడిన వారిని కూడా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఉదయ్ జనగామ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఘటనా స్థలానికి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఉదయ్ చాలా మంచివ్యక్తి అని, ఆయన కుటుంబానికి చట్ట పరంగా న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. ఉదయ్‌కు తల్లి జ్యోతి, తమ్ముడు, చెల్లెలు ఉన్నట్టు గ్రామస్థులు వివరించారు.

సింగరాజుపల్లి, కలెక్టరేట్‌లో విషాదం

ప్రతీ రోజు తమతో కలిసి మెలిసి ఉండే ఉదయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో సింగరాజుపల్లి గ్రామంతో పాటు కలెక్టరేట్‌లో విషాదం అలుముకుంది. అందరితో కలుపుగోలుపుగా ఉండే ఉదయ్ ప్రమాదానికి గురికావటంతో అధికారులు, గ్రామస్థులు, మిత్రులు, కుటుంబసభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఉదయ్‌కి డ్రైవింగ్ రావటంతో ప్రస్తుతం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

పలిమెల తహసీల్దార్‌పై వేటు

- గత నెల 24నే సస్పెన్షన్ ‍‍- గోప్యంగా ఉంచిన అధికారులు
- దక్కన్ సిమెంట్ భూ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో చర్యలు

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పలిమెల తహసీల్దార్ సర్వర్‌పై వేటు పడింది. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల 24 తేదీలోనే ఈ సస్పెన్షన్ ఆర్డర్ రాగా జిల్లా, డివిజన్ అధికారులు గోప్యంగా ఉంచడం చర్చనీయాంశంగా మారింది. నెల రోజుల క్రితం దక్కన్ సిమెంటు కంపెనీకి సుమారు 102ఎకరాల భూమిని ఒకే రోజులో రిజిస్ట్రేషన్ చేయడం కలకలం రేపింది. ఈఘటనపై తాజాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తమవుతుండగా, ఈ ఉత్తర్వుల వచ్చిన విషయాన్ని అధికారులు దాచి పెట్టడంలో ఆంతర్యమేమిటో అనే చర్చ జోరుగా సాగుతోంది.

తహసీల్దార్ సస్పెన్షన్‌లో రాజకీయం?

దక్కన్ సిమెంటు కంపెనీకి రాత్రి వేళల్లో ప్రైవేటు గదుల్లో రహస్యంగా రిజిస్ట్రేషన్ చేయడంపై రాజకీయం రాజుకుంది. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా విచారణకు ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీజేపీ నాయకులు సునీల్‌రెడ్డి, వామపక్ష నాయకులు సైతం స్పందించారు. తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. రెండు పార్టీల నేతలు పరస్పరంగా ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు జోక్యం చేసుకుంటూ రెండు పార్టీల నేతలపై ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విచారణ అనంతరం తహసీల్దార్‌పై వేటు వేసేందుకు అధికార యంత్రాంగం మొగ్గు చూపినప్పటికీ పక్క జిల్లాకు చెందిన ఓ మంత్రి జోక్యం చేసుకోవడంతో ఇంతకాలం సస్పెన్షన్ ఆగిందని తెలిసింది. తాజాగా ఈఘటనపై మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆరా తీయగా సస్పెన్షన్ పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడైంది.

దీంతో మంత్రి శ్రీధర్‌బాబు దీన్ని సీరియస్‌గా తీసుకొని చర్యలకు పూనుకోవాలని ఆదేశించడం వల్లే తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం.



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

కొండపర్తిలో గవర్నర్ కార్యదర్శుల పర్యటన

దత్తత గ్రామంలో పనుల పరిశీలన

తాడ్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ దత్తత తీసుకున్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో అభివృద్ధి పనులను గవర్నర్ జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ప్రైవేటు సెక్రటరీ పవన్ సింగ్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ దివాకరతో కలిసి పర్యటించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ గిరిజనుల అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనులు సోలార్ ఆర్గనైజింగ్ సిస్టం, మసాల మేకింగ్, టైలరింగ్ సెంటర్, స్కూల్, అంగన్‌వాడీ భవనాల కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, స్కిల్ డెవలప్మెంట్ తదితర అభివృద్ధి పనుల ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో 79 బీపీఎల్ గృహాలు ఉన్నాయని, 370 మంది జనాభా ఉన్నారని వ్యవసాయం ద్వారా వీరు జీవనోపాధి పొందేందుకు పదెకరాల భూమిలో ఒక బోర్ వేసి మోటార్లు అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఆర్డీవో వెంకటేశ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, వ్యవసాయ శాఖ అధికారి సురేశ్, ఎంపీడీవో సుమన వాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ జగదీశ్‌తో పాటు పలు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

పొలాల చుట్టూ కరెంటు తీగలు అమర్చవద్దు

ములుగు ఎస్పీ శబరీశ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల నుంచి రక్షణ కోసమంటూ పంటచేల చుట్టూ కరెంటు తీగలను అమర్చవద్దని ఎస్పీ శబరీశ్ అన్నారు. పంట రక్షణ, అటవీ జంతువుల వేట కోసం విద్యుత్ తీగలను అమర్చవద్దంటూ ములుగు సర్కిల్ పోలీసులు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. అక్రమంగా విద్యుత్ తీగలను అమర్చడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. గరిష్ఠంగా పదేళ్ల జైలుశిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బారికేడ్ల తొలగింపు

ములుగు పోలీస్ స్టేషన్ పరిధి జంగాలపల్లి జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఐరన్ బారికేడ్లను బుధవారం ఎస్సై వెంకటేశ్వరరావు పంచాయతీ సిబ్బంది చేత తొలగింపజేశారు. డ్రంకెన్ డ్రైవ్, అతివేగం, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

కుంభాభిషేకానికి కలెక్టర్‌కు ఆహ్వానం

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ఈనెల 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న మహాకుంభాభిషేకానికి హాజరు కావాలని కోరుతూ కలెక్టర్ రాహుల్‌శర్మకు ఆలయ ఈవో మహేష్ ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఈవో కలిశారు. మహా కుంభాభిషేకానికి రావాలని సాదరంగా ఆహ్వానించారు.



కలెక్టర్‌కు ఆహ్వానపత్రికను అందిస్తున్న ఆలయ ఈవో

ఎన్‌హెచ్ 930పీ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందే

- సాలార్‌తండా వద్ద హైవేపై రైతుల రాస్తారోకో
- సర్వేకు వచ్చిన అధికారుల అడ్డగింత



మహబూబాబాద్ సాలార్‌తండా వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించే జాతీయ రహదారి (930 పీ) అలైన్‌మెంట్‌ను మార్చి తమ ఇళ్లు, భూములు కోల్పోకుండా చూడాలని గిరిజన రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. సాలార్‌తండా వద్ద జాతీయ రహదారి సర్వేకు వచ్చిన ఎన్‌హెచ్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఎన్‌హెచ్ 365పై బైఠాయించారు. ఓ మహిళా పురుగుల మందు డబ్బాతో ధర్నాలో పాల్గొనడంతో గమనించిన అధికారులు ఆమె చేతిలో నుంచి డబ్బాను తీసి పడవేశారు. ఈ సందర్భంగా సాలార్‌తండా గిరిజన రైతులు భూక్య కల్యాణ్, బాదావత్ సీతారం, బాలాజీ, దారావత్ కిషన్ మాట్లాడుతూ.. వలిగొండ నుంచి భద్రాచలం వైపు వెళ్లే జాతీయ రహదారి (930పీ) తొలుత జిల్లా కేంద్రం బయట నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నుంచి నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారన్నారు. ఆ తర్వాత కొంత మంది రాజకీయ పలుకుబడిని ఉపయో గించి జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చారని చెప్పారు. దీంతో సాలార్‌తండా నుంచి జాతీయ రహదారి పోతుండడంతో తమ ఇళ్లు, భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు తమ గోడును తెలిపామన్నారు. జాతీయ రహదారి అలైన్ మెంట్‌ను మార్చి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరం నుంచి రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. రైతులు కొంత సమయం కావాలని కోరడంతో అధికారులు అక్కడి నుం చి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు భూక్య హతిరాం, కంసాలి, బాదావత్ లక్ష్మి, సుహాసిని, సిరి, సుభాషిణి, భద్రు, బిచ్యా, కల్యా ణ్, మంగ్యా, కాంతి, రంజిత్, రమేష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

దళితుల పట్ల అగ్ర కులస్థుల వివక్ష ?

- ఆలయానికి రంగులు వేయొద్దంటూ అల్టిమేటం
- మానుకోట జిల్లా జయపురంలో ఘటన
- దళిత సంఘాల ఆందోళన ‍- పీఎస్‌లో ఫిర్యాదు

నర్సింహులపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆలయానికి రంగులు వేసే విషయంలో తమ పట్ల అగ్రకులస్థులు వివక్ష చూపారంటూ దళితులు ఆందోళనకు దిగిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి బాధిత దళితులు, పలువురు కేవీపీఎస్ జిల్లా నాయకులు తెలిపిన వివరాల ప్రకారం జయపురం గ్రామంలో ఈనెల 14న వేణు గోపాల స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆలయానికి రంగులు వేసేందుకు నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ పెయింటర్‌కు పనులు అప్పగించారు. దాంతో సదరు పెయింటర్ జయపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను కూలి పనికి పిలిచి రంగులు వేయించడం ప్రారంభించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు అగ్ర కులస్థులు అక్కడికి వచ్చి దళితులు ఆలయానికి రంగులు వేయడం అపచారమని, వారు ఈ ఆలయానికి రంగులు వేయొద్దంటూ అల్టిమేటం జారీ చేసి పనులు అడ్డుకున్నట్టు తెలిపారు. దీంతో రంగులు వేసే పనికి వచ్చిన వారితో పాటు మరికొందరు దళిత యువకులు ఆలయం వద్దకు చేరుకుని బైఠాయించి నిరసన తెలిపారు. దళితుల పట్ల అగ్ర కులస్థులు వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేసి తహసీల్దార్ సీహెచ్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసిన దళిత సంఘాల నాయకులు కుల వివక్షను ప్రోత్సహిస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



వేణుగోపాల స్వామి ఆలయం వద్ద బైఠాయించిన దళితులు

మట్టిని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

గణపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి జిల్లా గణపురరం ఎస్సై అశోక్ తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సమ్మారావు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. థౌజండ్ క్వార్టర్స్ శివారులోని కర్నాలకుంట చెరువులో పలువురు కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. పలుమార్లు వారించినా యథేచ్ఛగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. మంగళవారం రాత్రి మట్టి తరలిస్తుండగా వారిని ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. దీనిపై ఏఈ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయగా పాముకుంట్ల సమ్మయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా చెరువు నుంచి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సమ్మారావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు న్యాయం

- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవియాదవ్
- 42 శాతం రిజర్వేషన్ ప్రకటనతో సంబురాలు



నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పాలనలోనే బీసీలకు న్యాయం జరిగిందని, ఇచ్చిన మాటమేరకు కులగణనను పూర్తిచేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ ప్రకటన నేపథ్యంలో ములుగులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయి పంచిపెట్టారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ పెంపునకు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడే పార్టీగా కాంగ్రెస్ మరోసారి నిరూపించుకుందని, మిగతా రాజకీయ పార్టీలు కూడా బీసీలకు రిజర్వేషన్ పెంచుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీలంతా కాంగ్రెస్ వెంటే ఉంటారని, వచ్చే అన్ని ఎన్నికల్లోనూ బీసీల ప్రాతినిధ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, ములుగు బ్లాక్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, మహిళా విభాగం అధ్యక్షురాలు రేగ కల్యాణి, పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ఎమ్డీ చాంద్‌పాషా, గోవిందరావుపేట అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్య తనతో బైక్‌పై రాలేదని భర్త ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

వారం క్రితం క్రిమిసంహారక మందు తాగి.. చికిత్స పొందుతూ మృతి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పండుగకు హాజరై తిరుగు ప్రయాణంలో భార్య తన బైక్‌పై రాకుండా ఆటోలో వెళ్లడంతో మనస్థాపం చెంది క్రిమిసంహారక మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇనుగుర్తి మండలం కోమటిపల్లి శివారు మూలస్తంభం తండాలో చోటు చేసుకుంది. కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ సురేష్(35) తన భార్య స్వరూపను తీసుకొని గత నెల 28న ఇంటికన్నెలోని స్వరూప సోదరి ఇంట్లో దుర్గమ్మ పండుగకు వెళ్లారు. పండుగ ముగిసిన అనం తరం తిరుగు ప్రయాణంలో సాయంత్రం సురేష్ తన బైక్ ఎక్కాలని భార్య స్వరూపను కోరాడు. దీనికి స్వరూప నిరాకరించి బంధువులందరి ముందే ఆటో ఎక్కి బయలు దేరింది. దీంతో మనస్థాపం చెందిన సురేష్ తన ఇంటికి వచ్చి రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. అదే రోజు మహబూబాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి మంగళవారం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సురేష్ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. బుధవారం సురేష్ తల్లి గామ్సీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలకు ఎందుకు వెళ్లలేదన్నందుకు..

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ.. విద్యార్థి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం దరాతండా శివారు రేగడిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రేగడిగూడెంకు చెందిన కారం అర్జున్-లక్ష్మి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమారుడు బద్రీనాథ్(13), కుమార్తె సంతానం. బద్రీనాథ్ ఈదులపూసపల్లి జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 1న స్కూల్‌కు వెళ్లకుండా ఎందుకు ఇంటివద్ద ఉన్నావని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన బద్రీనాథ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బద్రీనాథ్ మృతి చెందాడు. తండ్రి అర్జున్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బద్రీనాథ్ (ఫైల్)

తల్లి వైద్యానికి అప్పు దొరకలేదని..

కురవి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం తులిస్యతండాకు చెందిన బానోత్ బాలకిషన్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకిషన్ తల్లి జాను కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమెను రెండ్రోజుల క్రితం ఆస్పత్రిలో చేర్పించారు. నగదు కోసం పలువురిని అడిగిన బాలకిషన్ తల్లి అస్పత్రి ఖర్చుల కోసం డబ్బులు ఎక్కడ లభించకపోవడంతో మనోవేదనకు గురై బుధవారం ఉదయం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. బాలకిషన్ మృతి చెందాడు. మృతుడికి భార్య జాను, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



బాలకిషన్ (ఫైల్)

నీటి సంపులో పడి చిన్నారి మృతి

నెల్లికుదురు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నీటి సంపులో పడి బాలిక మృతి చెందిన సంఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని మదనతుర్తి శివారు ఈక్యా తండాలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గుగులోత్ మౌనిక మోతిలాల్ దంపతుల కూతురు లిఖిత (2) తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటి తిరిగి వచ్చారు. అనంతరం ఇంటి పనులు చేసుకుంటున్నారు. లిఖిత ఇంటి ముందు ఆడుకుంటూ ఉంది. ఈ క్రమంలో బాలిక ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి మృతి చెందింది. అనంతరం బాలిక ఇంటి ముందు కనిపించడకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల ఇండ్లలో వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఇంటి ఎదుట నీటి సంపులో చూడగా బాలిక మృతి చెంది నీటిపై తేలి కనిపించిందని తండావాసులు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



మృతి చెందిన లిఖిత



వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2310	2100
పల్లికాయ (సూక)	6280	4600
పల్లికాయ (పచ్చిది)	4000	3100
కందులు	6752	5540
పెసళ్లు	6685	5133
పత్తి	6980	5800
ఎల్లో మిర్చి	16500	13500
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	13700	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14500	11500
యూఎస్ 341	14200	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రైవేటు ఆస్పత్రిలో బాలుడి మృతి

డాక్టర్ నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆరోపణ

తొర్రూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్ నిర్లక్ష్యంతో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన ప్రకారం మండలంలోని కంటాయపాలెం గ్రామానికి చెందిన దాసరోజు వేణుగోపాల్ నాగమణిలకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సిద్దార్థ(16) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజులుగా దగ్గు, జ్వరం రావడంతో తల్లి నాగమణి తొర్రూరులోని బాలాజి నర్సింగ్‌హోమ్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ వికాస్ పరీక్షించి రక్త, మూత్ర పరీక్షలు చేయించి ఇంజక్షన్ తెప్పించి ఇవ్వడంతో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లి కొద్ది క్షణాల్లో మృతి చెందాడు. కళ్ల ముందు కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బంధువులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. అప్పటివరకు తమతో మాట్లాడిన బాలుడు కళ్ల ముందే మృతి చెందడంతో వారు బోరున విలపించారు. పెద్దలకు వేసే ఇంజక్షన్ డోసు ఎక్కువ ఇవ్వడంతో శ్వాస ఆడక మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. డాక్టర్ తమ కుమారుడిని అకారణంగా చంపాడంటూ దాడికి దిగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట బంధువులు బైఠాయించారు. సిద్దార్థ తండ్రి గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందగా తల్లి నాగమణి ఇద్దరు కుమారులను టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ చదివిస్తోంది. చేతికందిన కుమారుడు అకారణంగా మృతి చెందడంతో వారు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పరిస్థితిని సమీక్షించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ఆస్పత్రి నిర్వాహకులను వివరణ కోరగా బాలుడికి గతంలో శ్వాసకు సంబంధించిన వైద్యం తీసుకుంటున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు



మృతి చెందిన సిద్దార్థ



గతేడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతరలో సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుంటున్న భక్తులు

గద్దెల విస్తరణ లేనట్టేనా?

32 గుంటల స్థలంలోనే మేడారం గద్దెల సాలారం

- తల్లులను దర్శించుకునేందుకు ప్రతీ జాతరలో భక్తులకు ఇబ్బందులు
- 4 ఎకరాల్లో విస్తరించాలనే ప్రతిపాదన అటకెక్కిన వైనం
- 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ జాప్యం
- ప్రపంచం అబ్బుర పడేలా జాతర నిర్వహిస్తామని దాటవేసిన గత ప్రభుత్వం
- ప్రశాంత దర్శనం కోసం కాంగ్రెస్ సర్కారైనా దృష్టిసారించాలని భక్తుల విజ్ఞప్తి

వరంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర మేడారం. ప్రతీ రెండేళ్లకొకసారి జరిగే జాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తుంటారు. నాలుగు రోజుల్లో ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు తల్లుల దర్శనానికి రావటంతో తనవీతీరా దర్శనం లభించటం లేదు. కేవలం 32గుంటల స్థలంలో నిర్మించిన సమ్మక్క- సారలమ్మల గద్దెల ప్రాంగణం (సాలారం) ఇరుకుగా ఉండటమే దీనికి కారణం. 2012లో ఈ ప్రాంగాణాన్ని పక్కనే ఉన్న దేవాదాయ శాఖకు చెందిన 4ఎకరాల భూమిలోకి విస్తరించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చటం లేదు. గద్దెల ప్రాంగణం పక్కనే ఉన్న 19 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా ప్రతీ జాతరకు ఇరుకు ప్రాంగణంలో తల్లుల దర్శనం దక్కటం లేదని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

మహాజాతర స్థల విస్తరణకు విఫలయత్నాలు..

2018 ఫిబ్రవరిలో జరిగిన మహాజాతరకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ జాతర జరిగే స్థలాన్ని 200 ఎకరాలకు విస్తరించడంతో పాటు రూ.200 కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినప్పటికీ రూ.200 కోట్లు నిధులు రాలేదు. అయితే 2019లో అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి కొంత చొరవ చూపినప్పటికీ భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమేరా అన్నారు. మేడారం జాతర అభివృద్ధికి మొదటి విడతలో 62 ఎకరాల ప్రభుత్వ భూమి, 39 ఎకరాలు పట్టా భూమి కలిపి మొత్తం 101 ఎకరాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. 62 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కువగా రెడ్డిగూడెం, జంపన్నవాగు ఏరియాలో ఉంది. ఈ భూమిలో 58 మంది రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వీరందరు భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు ససేమేరా అన్నారు. ఇక 39 ఎకరాల పట్టా భూమిలో 32 మంది రైతులు ఉన్నారు. వీరిని కూడా వారి భూములను ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో భూసేకరణకు బ్రేక్ పడింది. కనీసం ఆ నిధులతో మేడారం ప్రాంగణం విస్తరించేందుకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇరుకైన సాలారంలో తల్లుల గద్దెలు

పెద్ద ఎత్తున తమ ఇలువేల్పులను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు తల్లుల దర్శన భాగ్యం కష్టమవుతుంది. గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడితే ఏ తెల్లవారు జామునో.. అర్థరాత్రినో.. తల్లుల దర్శన భాగ్యం లభించదు. గంటల తరబడి తల్లుల దర్శన భాగ్యం కోసం భక్తులు క్యూ కడితే ఐదారు నిమిషాలు కూడా తల్లులను మనసార మొక్కుకునే అవకాశం కలగటం లేదని భక్తులు వాపోతున్నారు. దీనికి ప్రధానం కారణం లక్షల సంఖ్యలో క్యూలో ఉన్న భక్తులైతే.. చాలా ఇరుకుగా ఉన్న గద్దెల ప్రాంగణం (సాలారం)మరో కారణంగా చెప్పుతున్నారు. సుమారుగా 32 గుంటల స్థలంలోనే తల్లుల గద్దెల ప్రాంగణం ఉంది. సమ్మక్క, సాలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల కొలువై ఉండే ఈ ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో భక్తులకు ప్రతీ జాతరకు ఇబ్బందికరంగా మారుతుంది. గద్దెల వద్ద ఐదారు వేల మంది భక్తులకంటే ఎక్కువ మంది భక్తులు నిలబడి మొక్కులు చెల్లించే పరిస్థితి లేదు. కనీసం దూరం నుంచి క్యూ లైన్‌లో నిలబడి మొక్కుకుందామన్న చుట్టు గోడలే అడ్డుగా ఉండటంతో అదికూడా సాధ్య పడటం లేదు. గంటల తరబడి గద్దెల ప్రాంగణం బయటే ఎండ, చలి అనే తేడా లేకుండా క్యూలో ఉండాల్సి వస్తుంది. దీనికి తోడు జాతర సమయంలో ఈ ప్రాంగణంలోనే పదుల సంఖ్యలో హుండీలు, బెల్లం బుట్టలను తొలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రాంగణం మొత్తం ఇరుకుగా మారుతుంది. ఈ నేపథ్యంలో మేడారం గద్దెల వద్ద ఉన్న సాలారం స్థలాన్ని విస్తరించాలని గత దశాబ్దం కాలంగా భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గద్దెల ప్రాంగణం విస్తరణకు నోచుకోవటం లేదు. దీంతో ప్రతి మహాజాతరకు తల్లుల దర్శన బాధలు తప్పెట్టు లేదని ఆందోళన భక్తుల్లో వ్యక్తం అవుతుంది.

దేవాదాయ భూముల్లో విస్తరిస్తేనే...

మహాజాతరను సక్సెస్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లపై దృష్టిసారించారు. దేవాదాయశాఖ మంత్రి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖనే ఉన్నారు. అయినప్పటికీ గిరిజన జాతరలో తల్లుల గద్దెల విస్తరణలో దేవాదాయశాఖ ప్రత్యేకంగా దృష్టిసారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గద్దెలు ఉన్న సాలారం కేవలం 32 గుంటల్లోనే ఉంది. దీన్ని మరో రెండు, మూడు ఎకరాల్లో విస్తరించాలని భక్తులు కోరుతున్నారు. గద్దెల పక్కనే దేవాదాయశాఖకు సంబంధించిన సుమారుగా 4 ఎకరాల భూమి ఉంది. దేవాదాయశాఖకు ఉన్న భూమిలో రెండు, మూడు ఎకరాల వరకు గద్దెల ప్రాంగణం విస్తరిస్తే తల్లులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సులభంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. నాలుగు వైపుల క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు తల్లుల దర్శనం కలిగే విధంగా కొత్తగా ప్రాంగణం నిర్మిస్తే బాగుంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

19ఎకరాల ప్రభుత్వ భూమి సేకరణలో జాప్యం

మేడారం తల్లుల గద్దెల సమీపంలోనే మరో 19 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని సేకరించేందుకు స్వాధీనంలో ఉన్న రైతులను ఒప్పించటంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2019లోనే గద్దెల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా, రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. 2022 జాతరలో మరోసారి భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2023లో ములుగు జిల్లా కలెక్టర్ ఖాతాకు రూ.2.73కోట్ల నిధులను జమ చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు 19ఎకరాల్లో ఉన్న రైతులతో సంప్రదింపులు జరపటం లేదనే ప్రచారం జరుగుతోంది. ఈ 19 ఎకరాలతో పాటు దేవాదాయశాఖకు చెందిన 4 ఎకరాలు కలిపి మొత్తం 24 ఎకరాల భూమిని సేకరించి గద్దెల ప్రాంగణంతో పాటు అతిధి గృహలు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. గిరిజనులు తమ ఆధీనంలో ఉన్న భూములను ఇచ్చేందుకు ససేమేరా అంటే.. కనీసం దేవాదాయ శాఖకు చెందిన నాలుగు ఎకరాల్లో గద్దెల విస్తరణ చేపట్టి తల్లుల దర్శనం భాగ్యం ప్రశాంతంగా కల్పించాలని భక్తులు కోరుతున్నారు. దేశనలుమూలల నుంచి వచ్చే భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శనం ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు. వచ్చే ఏడాది జరుగనున్న మహాజాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై కసరత్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మినీ జాతరకు అంకురార్పణ



ఎత్తు బంగారం (బెల్లం)తో గద్దెలకు వస్తున్న భక్తులు

- మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ
- తల్లుల దర్శనానికి 40వేలమందికి పైగా భక్తుల రాక
- సందడిగా మారిన సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం మినీజాతరకు అంకురార్పణ జరిగింది. ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే చిన్నజాతరకు అంకురార్పణగా.. మేడారం, కన్నెపల్లి గ్రామాల్లోని సమ్మక్క- సారలమ్మ అంతర్గత గుడుల్లో శుద్ధి పండుగను పూజారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా తెల్లవారుజామున నిద్రలేచి జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం పూజారులు మేడారంలో సమ్మక్క గుడి, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడిని శుద్ధి చేశారు. దేవతల ప్రతిమలు, పూజా సామగ్రి బయటకు తీసి శుభ్రపరిచారు. గుడిలోపల దేవతల పీఠాలను పూజారుల కుటుంబాల ఆడపడుచులు అలుకుపూతలు చేసి ముగ్గులతో అలంకరించారు. ఈ క్రమంలో పూజారులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి పూజాసామగ్రిని రహస్య పూజలకు సిద్ధం చేశారు. మినీ జాతర వేడుకలకు ముందు ఈ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. మరో ఆరు రోజుల్లో మేడారం మినీ జాతర ప్రారంభం కానుండగా.. మినీ జాతర ముగిసి.. తిరుగువారం పండుగ జరిగేరోజు వరకు నిష్టతో ఉపవాసాలు పాటిస్తూ గుడుల్లో రహస్య పూజలు చేసి మినీ జాతరను నిర్వహిస్తారు. అయితే ఈ బుధవారం జరిగిన గుడిశుద్ధి పండుగతో మినీజాతర వేడుకలకు అంకురార్పణగా భావిస్తారు.



జంపన్నవాగులోని బావుల్లో ఇసుక పూడిక తీస్తున్న కూలీలు



బయక్కపేటలో గుడిమెలుగు పండుగ చేస్తున్న చంద వంశీయులు

భారీగా తరల్చొన భక్తులు... ఎండ తీవ్రతకు ఇబ్బందులు

గుడిశుద్ధి పండుగతో బుధవారం మినీజాతరకు అంకురార్పణ జరగ్గా.. తల్లులను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం సుమారు 40వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఇక మేడారం వనదేవతలను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క- సారలమ్మలకు ఆయన ఎత్తు బంగారం సమర్పించారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అయితే వనదేవతలను దర్శించుకోవడానికి మేడారం తరలివచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత కారణంగా దేవస్థానం ప్రాంగణంలో బండలు కాలాయని పలువురు వాపోయారు. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడికి ఇబ్బంది పడ్డారు. కొంతమంది గొడుగులు వాడటం కనిపించింది.

మినీజాతరకు చురుగ్గా ఏర్పాట్లు..

మేడారం మినీ జాతరకు తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జంపన్నవాగులోని స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో వాగులోని ఊటబావుల్లో ఇసుక పూడికతీత పనులను ప్రారంభించారు. మినీ జాతర సుమారు 40లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు బావుల్లో పుడికతీసి ఆరు మోటార్ల ద్వారా ఎనిమిది బీవోటీలకు నీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సమ్మక్క-సారలమ్మల గద్దెల పరిసరాల్లో పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడి ఆవరణలో కూడా ఈ పనులు ప్రారంభమయ్యాయి.

సమ్మక్క పుట్టింట గుడిమెలుగు పండుగ

సమ్మక్క దేవతను తమ ఆడబిడ్డగా భావించి చంద వంశీయులు తాడ్వాయి మండలంలోని బయక్కపేట గ్రామంలో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆ గ్రామంలో గుడిమెలుగు పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పురాతన కాలం నుంచి ఉన్న సమ్మక్క మందిరం పైకప్పును తొలగించి కొత్తగా నిర్మించారు. అంతేకాకుండా సమ్మక్క దేవతకు సంబంధించిన పూజా సామగ్రి, ప్రతిమలను శుభ్రం చేసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళలు గుడిని అలుకుపూతలు చేసి రంగురంగుల ముగ్గులు వేశారు. డోలి వాయిద్యాల నడుమ చంద వంశీయులు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అదేవిధంగా తిరుగువారం వరకు నియమ నిష్టలతో దేవతకు పూజలు చేస్తూ వచ్చే బుధవారం జాతర నిర్వహిస్తారు.



జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఎదురు కోడి మొక్కుతున్న భక్తురాలు

పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం

- ఆ అధికారి కనుసన్నల్లోనే పరిపాలన
- ఉద్యోగుల ఐటీలో భారీ వసూళ్లకు తెర
- ఉన్నతాధికారులకు సైతం కొరకరాని కొయ్య
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, ఉద్యోగులు





ప్రైవేట్ వ్యక్తులకు ఐటీ అప్పగింత

ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వందలాది మంది రెగ్యులర్ ఉద్యోగుల ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌కు సంబంధించిన వ్యవహారాలను ఎంజీఎం మినిస్టీరియల్ సిబ్బంది గతంలో చూసేవారు. కానీ ఈ అధికారి ఓ ప్రైవేట్ ఆడిటర్ దగ్గరికి వెళ్లండి.. అంటూ మొబైల్ నెంబరు ఇస్తూ పంపుతున్నట్లు వైద్యులు, నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా ఆ ప్రైవేట్ ఆడిటర్ దగ్గరికి వెళ్లాక డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే పేదల ఆస్పత్రిగా పేరున్న మహాత్మాగాంధీ స్మారక ఆస్పత్రి (ఎంజీఎం) పరిపాలనలో ఓ అధికారి తన హవా నడిపిస్తున్నాడు. పెద్దాస్పత్రిలో ఆయన ఏం అనుకుంటే అది చేయగలడు. ఎంత న్యాయబద్ధమైన పనైనా తన పరపతితో పక్కన పెట్టగలడు. అమ్యామ్యాలు సమర్పిస్తే ఏ పనైనా క్షణాల్లోనే జరిగిపోతుంది.

అమ్యామ్యాల కోసమే కొనుగోళ్లు

పేద రోగులకు అవసరమయ్యే మందుల కొనుగోలు విస్మరించి.. తమకు లాభం చేకూర్చే మందులను మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిత్యం ఉపయోగపడే డ్రగ్స్ ఎంజీఎంలో అందుబాటులో లేకపోవడం ఇందుకు నిలువెత్తు సాక్ష్యం. ఇక రోగ నిర్ధారణ పరీక్షల కోసం ఉపయోగపడే కెమికల్స్‌ను కూడా తెప్పించకపోవడంతో సీబీపీ లాంటి సామాన్య పరీక్షలు కూడా ప్రయివేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని రకాల కాంట్రాక్టులు, కొనుగోళ్లు ఆ అధికారి కనుసన్నల్లో జరగాల్సిందే మరీ. ఆ అధికారి అన్నీ తానై వ్యవహరిస్తుండటంపై ఎంజీఎం గత సూపరింటెండెంట్ తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ కూడా ఈ వ్యవహారంలో జంకుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆర్ఎంవోకు వేతనం చెల్లింపు

ఎంజీఎం ఆస్పత్రిలో ఫారిన్ సర్వీస్ విధానంపై పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో కాల పరిమితి ముగిసింది. ఆయన మాతృ సంస్థ అయిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు వెళ్లాల్సి ఉంది. లేదంటే కొనసాగింపు ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేయాలి. ఈ రెండు జరగకుండానే అధికారికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జీతాలు ఇవ్వడం లేదు. ఎంజీఎం ఆస్పత్రిలో అభ్యుదయ సొసైటీ ద్వారా 38 మందికి కొనసాగింపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జీతాలు చెల్లించకుండా సదరు పరిపాలన అధికారి వేధింపులకు గురిచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంట్రాక్టు ఉద్యోగులు వెళ్లి జీతాల గురించి ఆరాతీస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు కాంట్రాక్టు ఉద్యోగులు వాపోతున్నారు.

బయోమెట్రిక్ కవర్లు లేని దుస్థితి

పేదల ఆస్పత్రిలో చెత్త వేసేందుకు బయోమెట్రిక్ కవర్లు కూడా అందుబాటులో లేవని నాలుగో తరగతి సిబ్బంది వాపోతున్నారు. స్టేషనరీ టెండర్లను ఖరారు చేయకుండా దాటవేస్తూ ఎక్కువ రేట్‌తో స్టేషనరీ కొనుగోలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక చాలీచాలని జీతాలతో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ జీతాల చెల్లింపుల కోసం కూడా ఆయనకు ముడుపులు సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడింది.

పదోన్నతులలోనూ అదే తంతు

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, కారుణ్య నియామకాల విషయంలో న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయంపై టీఎన్‌జీవో నాయకులు కూడా ఇటీవల సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అయినా అమ్యామ్యాలు ఇస్తేనే ఫైలు ముందుకు కదులుతుందని సదరు అధికారి తేల్చి చెప్పినట్లు సమాచారం.

ఉద్యోగాల ఎరతో వసూళ్లు

ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సీటీ టెక్నీషియన్‌లతోపాటు కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను 300 సీఎస్‌లో ఉద్యోగాలు ఇస్తామంటూ భారీ ఎత్తున వసూలు చేసినట్లు తెలిసింది.



ఆకాశాన్నంటుతున్న పసిడి ధర

రూ.85,800కు చేరిన పది గ్రాముల బంగారం

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. వివాహాలు, శుభకార్యాలు ప్రారంభమవుతున్న వేళ పసిడి ధర పెరగడంతో సామాన్య ప్రజలు లబోదిబోమంటున్నారు. గతంలో తులం బంగారం రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఉన్న సమయంలో అడ్వాన్స్ ఇచ్చి నగలు కావాలని దుకాణాలలో ఆర్డర్లు ఇవ్వగా ఇపుడు తులానికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు ధర పెరగడంతో వ్యాపారులు తల పట్టుకుంటున్నారు. బుధవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 85,800లకు చేరుకుంది. కిలో వెండి ధర రూ. 96,500లకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 79,450 పలికింది. ఉగాది పండుగ తర్వాత తెలుగు నూతన సంవత్సరంలో అధిక సంఖ్యలో వివాహాలు ఉండడంతో అప్పటివరకు ధర రూ.లక్షకు చేరుకుంటుందని వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆడపిల్లల పెళ్లిళ్ల చేయడం సామాన్యులకు తలకు మించిన భారం అవుతోంది.

పట్టు తప్పితే పరిస్థితేంటి?





కొందరు ఆటోవాలాలు పైసల కోసం బడి పిల్లల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. పరిమితికి మించి చిన్నారులను ఎక్కించి బడులకు తరలిస్తున్నారు. అందుకు ఇదిగో ఫొటోలే నిదర్శనం. ఓ ఆటోలో పిల్లలను ఒకరిమీద ఒకరిని కూర్చోబెట్టుకుని.. ఆటోకు రెండువైపులా బరువైన బ్యాగులు తగిలించి.. తీసుకెళుతున్న ఈ దృశ్యం హనుమకొండ బాలసముద్రం వద్ద కనిపించింది. ఆటోవాలాలు పైసల కోసం ఇలా నిబంధనలకు విరుద్ధంగా బడి పిల్లలను తరలిస్తున్న క్రమంలో ఏ చిన్నారి పట్టు తప్పినా.. ఏదైనా ప్రమాదం జరిగినా పరిస్థితేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పిల్లలకు జరగరానిది జరిగితే ఆ తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

వేంకన్నకు వెండి పుష్పాల బహూకరణ

చిలుపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న స్వామికి రూ.30వేల విలువ గల వెండి పుష్పాల మాల(234 గ్రాములు)ను బక్తులు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కొరివి దివ్య-సాయికృష్ణ దంపతులు బుధవారం స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం మొక్కును సమర్పించుకోవడంలో భాగంగా వెండి పుష్పాల మాలను ఆలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సబ్‌జైలును జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో వసతులు, భోజనశాలను పరిశీలించి ఖైదీల సమస్యలను తెలుసుకున్నారు. ఖైదీలకు ఏమైనా ఫిర్యాదులు ఉంటే కాగితంపై రాసి కంప్లెయింట్ బాక్సులో వేయాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను సవరణ చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను సవరణ చేయాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల మీద భారాలను మోపి దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ గద్దలకు దోచిపెట్టే విధంగా ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్యానికి బడ్జెట్‌లో మొండి చేయి చూపారన్నారు. కార్యక్రమంలో ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, ఉపేందర్, ఎండీ అజారుద్దీన్, బాల్నె వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయమందించాలి

చిలుపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని చిన్నపెండ్యాలకు చెందిన యువకుడు ఆకుల సాయికిరణ్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి హర్షమల్హోత్రను కోరారు. ఈమేరకు బుధవారం ఢిల్లీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. హనుమకొండ-హైదరాబాద్ మార్గంలో ఉన్న చిన్నపెండ్యాల హైవేపై రోడ్డు ప్రమాదాల కారణంగా ఇప్పటివరకు పదుల సంఖ్యలో మృతి చెందారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయమందించడంతో పాటు, ఇప్పటికే మంజూరైన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సాయికిరణ్ పేర్కొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. జనగామ పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో అండర్-14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించగా 50 పాఠశాలల నుంచి 300 మంది పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా 25 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, వీరు అక్టోబరు 17, 18 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.మనోజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు ఆవుల అశోక్, ఆడెపు శ్రీనివాస్, దిలీప్, మంజుల పాల్గొన్నారు.

ఐకమత్యంతో గులాబీ జెండా ఎగురవేయాలి



నర్మెటలో సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

నర్మెట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటి గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ గెలుపొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అనంతరం వారు మాటాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని ఎవరూ నమ్మడం లేదన్నారు. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, మాజీ జడ్పీ కోఆప్షన్ ఎమ్డీ.గౌస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, నర్మెట మాజీ సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, నర్మెట గ్రామ అధ్యక్షుడు నక్కల రవి పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్ యాదవ్ అధ్వర్యంలో మండలంలోని శామీర్‌పేటలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభనబోయిన శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.12లక్షల ఆదాయం ఉన్నవారికి ఇన్‌కమ్ టాక్స్‌ను రద్దుచేసి మేలు చేకూరుస్తుందని, కిసాన్ క్రెడిట్ కార్డుపై రైతులకు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు రుణాలను పెంచడం జరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణకు అన్యాయం జరిగిందని నిరసనలు చేపట్టడం సిగ్గు చేటన్నారు. మార్క ఉపేందర్, బానోత్ రాంకోటి, దడిగే రవికుమార్, ముక్క స్వామి, బడికె మహేశ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

దేవరుప్పుల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, అందుకు ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం పెద్దతండా, చిన్నమడూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, ప్రభుత్వం అమలు చేస్తున్న తీరును ప్రతీ ఒక్క ఓటరుకు వివరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో అధిక మెజారిటీ ఇచ్చి ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డిని గెలిపించుకున్న విధంగా అంతకంటే భారీ మెజారిటీతో విజయం సాధించి మండలంలోని అన్ని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచెంద్రునాయక్, వంగ దశరథ, రెడ్డిరాజుల రమేష్, భూక్యా సజ్జన్, భోనగిరి యాకస్వామి, దావెర అనిల్, జాకీర్, గుగులోతు రాజేందర్, కాడబోయిన వెంకన్న, బానోతు భాస్కర్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసాకు ఉపాధి లింకు ఎందుకు?

పాలకుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమి లేని కూలీలకు ప్రభుత్వం ఆతీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టడం మంచి పరిణామమే అయినప్పటికీ ఉపాధి హామీ పని దినాలకు లింకు పెట్టడం ఏమిటని సీపీఎం జిల్లా నాయకుడు చిట్యాల సోమన్న ప్రశ్నించారు. బుధవారం మండలకేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక మాయమాటలతో కాలం వెల్లదీస్తుందని విమర్శించారు. పథకాలు అమలు చేయకుండానే జాప్యం చేస్తోందని అన్నారు. ఇళ్ల లబ్ధిదారుల సర్వే పాదర్శకంగా లేదన్నారు. సీపీఎం శాఖ కార్యదర్శి విఘ్నేష్, చందు, రాజు, సాయికిరణ్, అజిత్, అనిల్, నిఖిల్ పాల్గొన్నారు.

రుణాల రికవరీ శాతాన్ని పెంచాలి

▸▸ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాల రికవరీ శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన వీవోఏలు, డీపీఎంలతో రుణాల రికవరీ, ఈ-పాస్ మిషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10న రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాకు రావడం జరుగుతుందన్నారు. స్త్రీనిధి రుణాల రికవరీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి రుణాలను రికవరీ చేయాలన్నారు. ఈ-పాస్ మిషన్ ద్వారా పూర్తి వివరాలను నిశితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా ఉపయోగించాలన్నారు. అనంతరం ఈ-పాస్ మిషన్లను కలెక్టర్ వీవోఏలకు పంపిణీచేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

జనగామ రూరల్: పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, జాతీయ రహదారులు, నీటిపారుదల శాఖ అధికారులతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ ప్రక్రియ, నవాబుపేట రిజర్వాయరు, జాతీయ రహదారుల పెండింగ్ పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యువజన క్రీడోత్సవాలు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలు ఈనెల 7, 8 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం వరంగల్ జిల్లా అధికారి చింతల అన్వేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, రన్నింగ్, షటిల్ సింగిల్స్, మహిళలకు కబడ్డీ, షటిల్ సింగిల్స్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 15-29ఏళ్ల గల యువతీ, యువకులు ఈ క్రీడల్లో పాల్గొంటారని, గెలుపొందిన వారికి సర్టిఫికెట్, మెమొంటో అందిస్తారన్నారు. వివరాలకు 95021 26384 నంబరులో సంప్రదించాలన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన సౌడ రమేశ్‌ను జఫర్‌గఢ్ మండల బీజేపీ నాయకులు సన్మానించారు. బుధవారం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ ఆధ్వర్యంలో నేతలు జనగామకు వెళ్లి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలు, మెమొంటోలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి.వలీపాషా, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల రాజు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇల్లందుల సారయ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పి.యాదగిరి, గడ్డం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మల్కాపూర్‌లో జిల్లా స్థాయి క్రీడలు

చిలుపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కాపూర్‌లో ఈనెల 7, 8, 9 తేదీల్లో జిల్లా స్థాయి గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఉద్దెమారి రాజ్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు అజయ్, రణదీప్, ఉదయ్‌కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 90006 23012, 77026 29608 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పశువులకు టీకాలు వేయించాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి, పశుసంవర్థక శాఖల ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని డాక్టర్ రమ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువుల్లో గర్భకోశ వ్యాధి నివారణ కోసం టీకా ఇవ్వడం జరిగిందన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని రైతులకు సూచించారు. 68 పశువలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివప్రసాద్, చిక్కుడు సమ్మయ్య, మధుమోహన్, వెంకటయ్య, అంజనేయులు, రాగిరి సమ్మయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ గిరిజన మోర్చా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు రామకోటి మాట్లాడుతూ బంజారా జాతుల ఆరాధ్య దైవమైన సద్గురు శ్రీ సేవాలాల్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలన్నారు. గిరిజనుల భవనం నిర్మించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవర ఎల్లయ్య, లక్ష్మణ్ నాయక్, ధరావత్ శ్రీనివాస్, రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకతను ఎండగట్టాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెద్ద ఎత్తున వ్యక్తమవుతుందని, దీన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి పాలన తీరును ఎండగట్టాలని బీఆర్ఎస్ తరుపున నియమితులైన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు అన్నారు. బుధవారం కట్కూరు, పోచన్నపేట, కొడవటూరు, లింగంపల్లి క్లస్టర్లోని గ్రామాల్లో ఇన్‌చార్జ్‌ల నేతృత్వంలో సమావేశాలు నిర్వహించి పార్టీ పరిస్థితిపై నివేదికలు తయారు చేసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారని తెలిపారు. నాయకులకు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయమే పరమావధిగా పనిచేయాలన్నారు. కార్యక్రమాల్లో గజ్జెలనర్సిరెడ్డి, మామిడాల రాజు, దయాకర్, బాల్నె సిద్దులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



ధర్మాపురంలోని ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

దేవరుప్పుల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్‌కుమార్ పరిశీలించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులతో పాటు పీఎంశ్రీ, మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా మంజూరైన మరుగుదొడ్ల మరమ్మతులు, తాగునీరు, గ్రావెల్ ఫిల్లింగ్ తదితర పనులు కోలుకొండ, ధర్మాపురం ఉన్నత పాఠశాలలు, దేవుని గుట్టతండా, ధరావత్‌తండా అంగన్‌వాడీ కేంద్రాలలో కొనసాగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, పనుల పురోగతిపై ఆరా తీశారు. అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నిధులను కూడా వెంటనే విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులు సమకూర్చుతున్నామని, ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్‌కు మంచి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ రామలింగాచారి, ఏఈలు మహేష్, శ్రీనివాస్, ఎంఈవో కళావతి, ఎంపీవో సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సింహాజీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : కలెక్టర్

రఘునాథపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, అకౌంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు సక్రమంగా రిజిస్టర్లను నిర్వహించాలని, ప్రతీ రోజు సమయపాలన పాటించాలని సూచించారు. సరుకుల నిల్వ గది, కూరగాయలు, బియ్యం బస్తాలు, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి బోజనం అందించే తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జీసీడీవో గౌసియాబేగం, ఎంపీడీవో శ్రీనివాసులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని, బీజేపీ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరోత్తంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కూడా ఉపాధ్యాయులకు, తెలంగాణ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు తనను బలపరిచి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగపురి రాజలింగం, లేగ రామ్మోహన్, దేవరాయి ఎల్లయ్య, తోకల ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అలసత్వం వహించొద్దు

▸▸ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరావు

▸▸ డీవార్మింగ్ డేపై ఇప్పగూడెం పీహెచ్‌సీలో సమీక్ష



ఇప్పగూడెం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో సిబ్బంది అలసత్వం వహించవద్దని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండలంలోని ఇప్పగూడెం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం నేషనల్ డీవార్మింగ్ డేపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 10న నిర్వహించనున్న డీవార్మింగ్ డేను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. 1 నుంచి 19ఏళ్ల లోపు ఉన్న ప్రతీ ఒక్కరికి మాత్రలను వేయించాలన్నారు. నులిపురుగులను నివారించకపోతే కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి మాత్రల ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు. 1 నుంచి 2ఏళ్ల వయస్సు ఉన్నవారికి సగం అల్బెండజోల్ మాత్రను, 2నుంచి 3ఏళ్ల వయస్సు ఉన్నవారికి పూర్తి మాత్రను, 3 నుంచి 19ఏళ్ల వయస్సు ఉన్నవారికి పూర్తి అల్బెండజోల్ మాత్రను నేరుగా వేయించాలని కోరారు. ఈ మకార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం సందర్శన

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంను డీఎంహెచ్‌వో కె.మల్లికార్జునరావుబుధవారం సందర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా.. లేదా అని పలువురిని అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలు జరిగేటట్లు వైద్య సిబ్బంది గర్భిణులను చైతన్య పర్చాలని, ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

అరూరికి పలువురు నేతల పరామర్శ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను మండలంలోని ఉప్పుగల్లులో వివిధ పార్టీల నేతలు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు బుధవారం కలిసి పరామర్శించారు. రమేశ్ తల్లి వెంకటమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, ఈవీ శ్రీనివాసరావు, గటిక విజయ్‌కుమార్, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎ.నిషిధర్‌రెడ్డి, నేతలు ప్రసాదరావు, తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు వన్నాల వెంకటరమణ, కాజీపేట దర్గా, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్‌లు ఊకంటి వనంరెడ్డి, జక్కు రమేశ్ గౌడ్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు వేముల నాగరాజు, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి, ఎం.సుధాకర్, సదానందం, ప్రభాకర్ తదితరులు వెంకటమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రమేశ్‌ను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జనగామ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ శ్రీను, గణిపాక మహేందర్, లింగాల నర్సిరెడ్డి, డాక్టర్ రాజమౌళి, డాక్టర్ కృష్ణ, మిద్దెపాక స్టాలిన్, గాదెపాక ప్రసాద్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిడుగు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ బానోత్ రాంచరణ్‌నాయక్ బుధవారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం తనిఖీలు చేపట్టగా ఆకేరు వాగు నుంచి ఇసుకను అనుమతిలేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండలంలోని కొడవటూరు గ్రామానికి చెందిన నడిగొట్టు లింగం(40) మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళుతుండగా యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరు సమీపంలో కుక్క అడ్డు రావటంతో సడన్‌గా బ్రేక్ వేయటంతో బైక్ పైనుంచి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగం భార్య వనిత ఫిర్యాదు మేరకు ఆలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బేడబుడగ జంగాల రిజర్వేషన్‌ను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోటం రాజు

చిలుపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో, కేటగిరీ (ఎ)లో ఉన్న బేడ బుడగజంగాలతో పాటు, మిగిలిన ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచాలని బుడగ జంగాల సంఘం మండల అధ్యక్షుడు మోటం రాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాజవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో వర్గీకరణ సాధించడం హర్షనీయమే అయినప్పటికీ రాష్ట్రంలో 5 లక్షల జనాభా కలిగిన బేడబుడగ జంగాలతో కూడిన ఉప కులాలకు కేవలం 1శాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో మోటం రాములు, పురాణం శంకర్, రవి, మోటం జంపయ్య, ప్రవీన్, వెంకటయ్య, శ్రీనివాస్, శేఖర్, ఉప్పలయ్య, తిరుపతి, ఎల్లయ్య, ధర్మపురి, సురేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు జీడికల్ రోడ్డుకు మోక్షం!

▸▸ విస్తరణకు రూ.8 కోట్లు మంజూరు ▸▸ మాట నిలుపుకొన్న ఎమ్మెల్యే కడియం



జనగామ - జీడికల్ రోడ్డుపై ఉన్న జీడికల్ స్వాగత తోరణం

లింగాలఘణపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు గల జీడికల్ ఇన్నాళ్లు పేరు గొప్ప ఊరు దిబ్బగా ఉండేది. శ్రీరామ చంద్రుడు తన వనవాస సమయాన పాదముద్రలు మోపిన జీడికల్‌కు అధ్వానంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాక్షాత్తు ఆ భగవంతుడే గుర్తుకు వస్తున్నాడని భక్తులు ప్రతీ సారి ఆందోళనకు గురయ్యేవారు. గడిచిన ముప్పై ఏళ్లగా ఎన్నికలు ఏవైనా తమ ప్రధాన డిమాండ్ మాత్రం జనగామ నుంచి జీడికల్ దాకా పక్కాగా డబుల్‌రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే ప్రతీ అభ్యర్థికి విన్నవించేవారు. కానీ, ఒకరి తర్వాత ఒకరు ఎమ్మెల్యేలు మారినా అధ్వానపు రోడ్డు దుస్థితి మాత్రం మారకపోవడంతో కళ్లెం, సిరిపురం, జీడికల్ గ్రామాలకు చెందిన ప్రజలకు నాయకులపై నమ్మకం సన్నగిల్లింది. చివరిగాగతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ డిమాండ్‌ను కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తనను గెలిపిస్తే ఏడాదిలోనే డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తాజాగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఎంఆర్ఆర్ కింద రూ.8 కోట్లను మంజూరు చేయించి బుధవారం ప్రొసీడింగ్ ఉత్తర్వులను అందజేయడంతో ఆయా గ్రామాల ప్రజల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. ఎంఆర్ఆర్(మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్) ద్వారా జనగామ నుంచి జీడికల్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డును స్పెషల్ రిపేర్ చేయడంతో పాటుగా ఇప్పుడున్న రోడ్డుకు రెండుపక్కల రెండున్నర మీటర్ల వెడల్పును విస్తరించేందుకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ రూ.8 కోట్లను మంజూరు చేసింది. దీంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవను అభినందిస్తూ జీడికల్ గ్రామంలో ఆయన చిత్రపటానికి స్థానికులు క్షీరాభిషేకం చేశారు. కడియం శ్రీహరి మాట ఇచ్చిన ప్రకారంగా ఏడాదిలోనే నిధులను మంజూరు చేయించారని, ఎట్టకేలకు మోక్షం లభించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జీడికల్‌లో కడియం శ్రీహరి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న స్థానికులు